ప్రజాశక్తి

ఆదివారం 30 జులై 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు



పులిచింతలలో పెరిగిన నీటి నిల్వ

- వారం రోజుల్లో 13 టిఎంసిల చేరిక
- డెల్టాకు తాత్కాలికంగా తొలగిన కష్టాలు

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

పులిచింతలలో నీటిమట్టం పెరుగుతోంది. సాగర్‌కు దిగువన,పులిచింతల ఎగువన కురిసిన వర్షాలతో శనివారం 50 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. పులిచింతలలో గరిష్ట నీటి నిల్వ 45.77 టిఎంసిలు కాగా శనివారం రాత్రికి 30.74 టిఎంసిల నీటి నిల్వ ఉంది. ఈనెల 22న గత శనివారం 17.77 టిఎంసిల నీరు నిల్వ ఉండగా వారం రోజుల వ్యవధిలో కురిసిన వర్షాలతో ఎగువ నుంచి పులిచింతలకు దాదాపు 13 టిఎంసిల నీరు వచ్చి చేరింది. అయితే గతేడాది ఎగువ నుంచి వరదరావడంతో జులై 29న పులిచింతలలో 41.56 టిఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ ఏడాది సాగర్ నుంచి రాకున్నా కేవలం పులిచింతల ఎగువన కురిసిన వర్షాలతోనే 13 టిఎంసీల నీటిని జలాశయంలో నిల్వ చేయగలిగారు. ప్రస్తుతం పులిచింతలలో నీటి నిల్వ ఆశాజనకంగా ఉండటం, ప్రత్యామ్నాయంగా పట్టిసీమ నుంచి నీరు తీసుకునే అవకాశం ఉండటం వల్ల కృష్ణా డెల్టాకు నీటి ఎద్దడి వచ్చే అవకాశం లేదని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. అయితే నాగార్జునసాగర్ ఆయకట్టులో ప్రస్తుతం నీటి ఎద్దడి పొంచిఉంది. ప్రస్తుతం తాగునీటి అవసరాల నిమిత్తం సాగర్ కాల్వలకు నీటి విడుదల కొనసాగుతోంది. దీంతో సాగర్ ఆయకట్టులో ఈఏడాది ఖరీఫ్ సాగులో జాప్యం అనివార్యంగా కన్పిస్తుంది. ఇప్పటివరకు పత్తి తప్ప ఇతర పంటలు ఏవి కనీస విస్తీర్ణంలో సాగు చేయలేదు. మరో వైపు నాగార్జున సాగర్‌లో గరిష్ట నీటి నిల్వ 312 టిఎంసిల సామర్ధ్యం ఉండగా ప్రస్తుతం 140.85 టిఎంసీల నీరునిల్వ ఉంది. ఎగువ నుంచి సాగర్ జలాశయంకు వరద ప్రవాహం రావడంలేదు. 6198 క్యూసెక్కులనీరు సాగర్ కాల్వలకు విడుదల చేస్తున్నారు. గతేడాది ఇదే రోజుకు 215.99 టిఎంసీలనీరునిల్వ ఉంది. ఈఏడాది ఇప్పటివరకు ఎగువనుంచి నీరు రాకపోవడంతో నీటి మట్టం గణనీయంగా తగ్గింది. గతేడాదిఇదే సమయానికి ఆల్మట్టి,జూరాలనుంచి భారీగా వరద ప్రవాహం రావడంతో సాగర్‌లో నీటి నిల్వ ఆశాజనకంగా ఉంది. ఈఏడాది ఇంకా శ్రీశైలం నిండకపోవడం వల్ల సాగర్‌కు వరద ప్రవాహం రావడంతో జాప్యం జరిగే అవకాశం కన్పిస్తుంది. పూర్తి నిరాశజనకంగా ఉంది. శ్రీశైలంలో గరిష్ట నీటి నిల్వ 215.80 టిఎంసీలు కాగా ప్రస్తుతం 48.74 టిఎంసిల నీరునిల్వ ఉంది. గతేడాది ఇదేరోజుకు 184.28 టిఎంసిలనీరు నిల్వ ఉండగా ఈఏడాది శ్రీశైలంలో నీటిమట్టం గణనీయంగా తగ్గిపోయింది. అలాగే ప్రకాశం బ్యారేజికి శనివారం కూడా వరద ప్రవాహం కొనసాగుతోంది. గత 10 రోజులుగా తెలంగాణలోని ఖమ్మం,నల్గొండ జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలతోపాటు పులిచింతల దిగువన, ప్రకాశం బ్యారేజి ఎగువన కురిసిన వర్షాలతో మున్నేరు, కట్టలేరు, బుడమేరు, పాలేరు

2లో



సమస్య పరిష్కరించకుంటే సమ్మెలోకి...

కలెక్టరేట్ వద్ద 7,8 తేదీల్లో రెండ్రోజుల నిరసన

విఆర్ఎ సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు బందగి సాహెబ్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఉద్యోగ భద్రత, న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆగష్టు 7, 8 తేదీలలో రెండు రోజుల పాటు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసనకు పిలుపునిచ్చినట్లు వీఆర్ఏల సంఘం (సిఐటియు అనుబంధం) పల్నాడు జిల్లా అధ్యక్షులు షేక్ బందగీ సాహెబ్ తెలిపారు. శనివారం స్థానిక కోటప్పకొండ రోడ్డు లోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో వీఆర్ఏల సమావేశం షేక్ బందగీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పే స్కేలు, నామిని, ప్రమోషన్లు మొదలగు సమస్యల పరిష్కారం కొరకు నిర్వహించే రెండు రోజుల దీక్షల్లో విఆర్ఎ లు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. దీక్షల అనంతరం ప్రభుత్వం సమస్యలు పరిష్కారం చేయకపోతే సమ్మెలోకి వెళతామని చెప్పారు. సమావేశంలో పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ వీఆర్ఏల సమస్యలు పరిష్కరించడం, న్యాయమైన కోరికలు తీర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. వీఆర్ఏలు గొంతెమ్మ కోరికలు కోరడం లేదని ఉద్యోగ భద్రత, న్యాయమైన సమస్యలు పరిష్కరించమని వేడుకుంటున్నారన్నారు. రెవెన్యూ అధికారులు చేస్తున్న పనులలో వీఆర్ఏల పాత్ర కీలకమన్నారు. అయినప్పటికీ వారి పట్ల రెవెన్యూ అధికారులు నుండి ప్రభుత్వ పెద్దల వరకు ప్రతి ఒక్కరు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారని మండిపడ్డారు. వీఆర్ఏలకు కనీస వేతనాలు, నామినీలను వీఆర్వోలుగా గుర్తించడం వేతనంతో కూడిన డిఏలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీఆర్ఏలు చేపట్టే రెండు రోజుల దీక్షలతో పాటు భవిష్యత్తులో వారు చేపట్టబోయే ప్రతి కార్యక్రమానికి సిఐటియు మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు. సమావేశంలో సిఐటియు నాయకులు గుంటూరు మల్లీశ్వరి, అన్ని మండలాల నుండి విఆర్ఎలు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై అఘాయిత్యం

3లో

గౌతమ బుద్ధా రోడ్డుపై ఆంబోతుల బీభత్సం

3లో



ఎడాపెడా విద్యుత్ ఛార్జీల అదనపు భారం

వీక్షణం

8లో

'క్విట్ మోడీ - సేవ్ ఇండియా'

ఆగష్టు 9న విజయవాడలో మహాశ్రామిక గర్జన

జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకుల పిలుపు

8లో

పులిచింతలలో పెరిగిన నీటినిల్వ

(మొదటిపేజీ తరువాయి)

తదితర ప్రాంతాల నుంచి వరద ప్రవాహం వస్తోంది. ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో ప్రకాశం బ్యారేజికి మొత్తం అన్ని గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్టు దిగువకు విడుదల చేస్తున్నారు. మరో వైపు శనివారం రాత్రి 1.35 లక్షలక్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వర్షాలతో ప్రకాశం బ్యారేజి నుంచి కాల్వలకు నీటి విడుదల నిలిపివేశారు.

నలుగురు వ్యక్తులు అరెస్ట్

ప్రజాశక్తి - తుళ్లూరు

ఇనుము దొంగతనం కేసులో నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. మండలంలోని వెలగపూడి గ్రామ పరిధి లోని రాష్ట్ర సచివాలయం వెనుక సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కన కల్వర్ట్ బ్రిడ్జిల వద్ద ఇనుము చువ్వలు కోసుకొని దొంగతనంకు ప్రయత్నించిన మంగళగిరి మండలం కురగల్లు గ్రామానికి చెందిన రావూరి రాంబాబు,కొమ్మ్మూరి రామారావు, గోచిపాత కమలాకర్, రావూరి నాగరాజు లను వ్యక్తులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేయడం జరిగిందని సిఐ ఆనందరావు శనివారం తెలిపారు.

పేకాట స్థావరం పై దాడి

ప్రజాశక్తి - తుళ్లూరు

మండలం లోని లింగాయపాలెం గ్రామ పరిధిలో పేకాట స్థావరంపై శనివారం పోలీసులు దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుంచి రూ 600లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని సిఐ అనందరావు తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

ప్రజాశక్తి -తెనాలి :పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు.ఓ ఇంట్లో పేకాడుతున్న సమాచారంతో పట్టణ త్రీ టౌన్ పోలీసులు దాడి చేసి ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ. 17500 స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

భార్యను వేధించిన కేసులో భర్త అరెస్ట్

ప్రజాశక్తి-తెనాలి

భార్యను వేధించిన కేసులో నిందితుడిని రూరల్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఎస్సై సిహెచ్ వెంకటేశ్వర్లు వెల్లడించిన వివరాల ప్రకారం రూరల్ గ్రామం ఎరుకలపూడి గ్రామానికి చెందిన కటారి లక్ష్మీ బిందుకు 2021 ఆగస్టు 27న పల్నాడు జిల్లా, నరసరావుపేట పరిధిలోని బరంపేట ప్రాంతానికి చెందిన కఠారి అజయ్ చంద్రతో వివాహం జరిపించారు. తనకు పిల్లలు కలగడం లేదని భర్త శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నాడని, అనునిత్యం కొడుతున్నారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి, కోర్టుకు హాజరుపరచగా అతనికి 14 రోజులు మేజస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

ఓటర్ల జాబితాను సిద్ధం చేయండి

పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

స్పెషల్ సమ్మరీ రివిజన్ - 2024 ఓటర్ల జాబిత తయారీ కు సంబంధించి, అధికారులంతా సమన్వయంతో పని చేసి సన్నద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. నరసరావుపేట కలెక్టరేట్ లోని ఎస్ ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో శనివారం స్పెషల్ సమ్మరీ రివిజన్ -2024 ఎన్నికల జాబితా తయారీపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆగస్టు 2, 3 తేదీలలో విశాఖపట్నం లో రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి నివేదికను అందివ్వనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా రెవెన్యూ అధికారి, మూడు రెవెన్యూ డివిజన్ల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.సమావేశంలో పల్నాడు జిల్లాకు సంబంధించిన ఓటర్ల జాబితా రూప కల్పనలో తీసుకోవలసిన జాగ్రత్తలను జిల్లా కలెక్టర్ అధికారులకు వివరించారు. రెవెన్యూ డివిజన్ ల పరిధిలో 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఓటర్ల జాబిత



తయారీ లో వస్తున్న ఇబ్బందులను, అధిగమించి భారత ఎన్నికల సంఘం నూతన విధి,విధానాలను పాటిస్తూ రూపకల్పన చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా తయారీకి సంబంధించి జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేసి, వాటి ఆధారంగా ఓటర్ల జాబితాను రూపొందించాలని పేర్కొన్నారుఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, గురజాల, సత్తెనపల్లి, నరసరావుపేట ఆర్డీవోలు, పలువురు తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

సమానత్వంతోనే దళిత మహిళా సాధికారత

మాజీ మంత్రి డొక్కా మాణిక్య వర ప్రసాద్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సమానత్వంతోనే దళిత మహిళా సాధికారత వస్తుందని మాజీ మంత్రి డొక్కా మాణిక్య ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జాషువా, పూలే, పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కవి జర్నలిస్ట్ బి.విల్సన్ అధ్యక్షతన హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ప్రచురించిన మేము కూడా చరిత్ర నిర్మించాం పుస్తకావిష్కరణ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి డొక్కా మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ దేశంలోని ప్రత్యేకించి హిందూ మహిళల కోసం హిందూ కోడ్ బిల్లు ప్రతిపాదించారని, ఇందుకు అప్పటి కేంద్ర ప్రభుత్వం అంగికరించపోవడంతో తన కేంద్ర న్యాయశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసి ప్రతిపక్షంలో కూర్చున్నారని తెలిపారు. కుల నిర్మూలన, కార్మిక ఉద్యమాలలో భాగంగా దళిత మహిళలను కార్యాచరణతో నాయకులుగా తీర్చిదిద్దారని తెలిపారు. సంస్కృతి, సాంప్రదాయ



పుస్తకావిష్కరణలో డొక్కా మాణిక్యవరప్రసాద్, స్వరూపరాణి, కొరివి వినయ్‌కుమార్ తదితరులు

రంగాలలో విప్లవం తీసుకువచ్చి దళిత మహిళలకు సమాజంలో ఒక గౌరవాన్ని తెచ్చారని వివరించారు. మేము కూడా చరిత్ర నిర్మించాం పుస్తకాన్ని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూప రాణి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు బండారు సురేష్ బాబు, డాక్టర్ డి సి హెచ్ అంజయ్య, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్ కుమార్, ప్రగతి నారీ శక్తి సంఘం అధ్యక్షులుపొట్లూరి దేవి, సాహితీ పరిశోధకులు పాల అశోక్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

ప్రజాశక్తి-దుగ్గిరాల

వర్షాలు కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవ కాశాలు ఎక్కువగా ఉన్నాయి. మండలంలో ఎక్కడపడితే అక్కడ పేరుకుపోయిన మురుగునీటి కుంటలు ఏపుగా పెరుగుతున్న కంప, దోమలకు ఆవాసాలుగా మారే అవకాశం ఉంది. వాతావరణంలో వచ్చిన మార్పు కూడా ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవ కాశాలు ఎక్కు వగా ఉన్నాయి. దీనితో స్వైన్ ఫ్లూ, మలేరియా, టైఫా యిడ్, డెంగీ వంటి జ్వరాలతో పాటు వాంతులు, విరోచ నాలు, దగ్గు, జలుబు, గొంతు నొప్పి, శ్వాసకోశ వ్యాధులు, అజీర్ణం, విరోచనాలు, కామెర్లు లాంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ కనబరచాల్సిన అవసరం ఉంది.

వేడి ఆహారం తీసుకోండి

పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ అబ్దుల్ రెహమాన్

ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ అబ్దుల్ రెహమాన్ వివరించారు. కలుషిత నీరు, ఆహారం పట్ల జాగ్రత్తగా ఉండాలని, వేడి ఆహారం భుజించాలని, ఆహారంపై ఈగలు వాల కొండ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోడ్ల పక్కన అమ్మే తినుబండారాల జోలికి వెళ్లొద్దని, ముఖ్యంగా పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలని చెప్పారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా జాగ్ర ్తలు తీసుకోవాలని, దోమలు కుట్టకుండా దోమతెరలు ఉపయోగించాలని, తలుపులు,కిటికీలు వేసి ఉంచా లన్నారు. ప్రజలు అనారోగ్యం బారిన పడితే వెంటనే ఆసుపత్రికి రావాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై ప్రభుత్వం క్షేత్రస్థాయిలో అవ గాహన కల్పించాలని, ప్రత్యేక కార్యాచరణ చేపట్టాల్సి ఉంటు ందని, వైద్య సిబ్బంది పర్యవేక్షణలో ప్రతి ఇంటికి తిరిగి ఎప్పటికప్పుడు పరిస్థితులు పరిశీలించాలని సూచిం చారు. రక్త నమూనాలు సేకరించడం, డ్రై డే ను తప్ప నిసరిగా అమలు జరపడంతో పాటు ప్రభుత్వ వైద్యశాలలో మందుల కొరత లేకుండా చూడాలని కోరారు.









జగనన్న కాలనీల్లో కనీస వసతులు శూన్యం

జనసేన నాయకుల పరిశీలన

ప్రజాశక్తి-తెనాలి

జగనన్న కాలనీల పేరట భూసేకరణ మొదలు గృహ నిర్మాణం వరకు అధికార పార్టీ నాయకుల దోపిడి మినహా పేదలకు ఒరిగిందేమీ లేదని జనసేన నాయకులు అన్నారు. ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు శనివారం సిరిపురం, గోలి డొంక ప్రాంతంలోని జగనన్న కాలనీలను నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న కాలనీల పేరట ప్రభుత్వం కేటాయించిన నివేశన స్థలాలలో కనీస మౌలిక వసతులు లేవన్నారు. రోడ్లు, డ్రైనేజీ వంటి సదుపాయాల కల్పనలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మెరకలు కూడా తోలించలేదని, వర్షాలకు నిర్మించే ఇళ్లలో కూడా భారీగా నీరు చేరిందని అన్నారు. జగనన్న కాలనీలలో ప్రజలు నివాసం ఉండాలంటే కనీసం 15 సంవత్సరాలు పట్టే పరిస్థితి కనబడుతుందన్నారు. జనసేన ఆధ్వర్యంలో జగనన్న కాలనీలలో జరుగుతున్న అవినీతి బాగోతాన్ని సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేసేందుకే పర్యటించినట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బి రవికాంత్, స్మాయిల్ బేగ్, జాకీర్ అహ్మద్, పి మురళీకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు దివ్వెల మధుబాబు, వేణుమాధవ్, తదితరుల పాల్గొన్నారు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

మౌళిక సదుపాయాలు లేని చోట పేదలకు ఇళ్ళ స్థలాలు ఇచ్చి ప్రజలను జగన్మోహన్ రెడ్డి మోసం చేశారని జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి కొమ్మిశెట్టి సాంబశివరావు అన్నారు. సత్తెనపల్లి మండలంలో జగనన్న కాలనీలు టిడ్కో గృహాలను జనసేన పార్టీ నాయకులు శనివారం సందర్శించి నిరసన కార్యక్రమం చేపట్టారు. వైసిపి నేతలు జేబులు నింపుకునేందుకే కాలనీలు ఏర్పాటు చేశారు ని ఆరోపించారు. జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు బొర్రా అప్పారావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల కారణంగా పేదలు నలిగిపోతున్నారని విమర్శించారు. వడ్డీలకు అప్పులు తెచ్చి టిడ్కో గృహాలకు చెల్లించారని అన్నారు. తక్షణం టిడ్కో గృహాలు పూర్తి చేసి లబ్దిదారులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్ కుమార్ జనసేన పార్టీ నాయకులు నాదెండ్ల నాగేశ్వరరావు, నర్సయ్య తాడువాయి లక్ష్మి, వీరమహాళలు జనసేన నాయకులు పాల్గొన్నారు







మంగళగిరిలో రోడ్డుపైన ఆంబోతులు బీభత్సం, ఆంబోతుల దాడిలో గాయపడ్డ వృద్ధురాలు, ఆంబోతులు ధ్వంసం చేసిన ఆటో ముందుభాగం

గౌతమ బుద్ధా రోడ్డుపై ఆంబోతుల బీభత్సం

ప్రజాశక్తి-మంగళగిరి

నగర ప్రధాన రహదారి గౌతమ బుద్ధా రోడ్డుపై శనివారం రాత్రి రెండు ఆంబోతులు భీభత్సం సష్టించాయి. నడిరోడ్డుపై ఒకదానినొకటి పొడుచుకుంటూ వాహన దారులను భయబ్రాం తులకు గురిచేశాయి. అదే సమయంలో అటుగా వస్తున్న ద్విచక్ర వాహన దారుడు నడి రోడ్డుపై పొడుచుకుంటున్న ఆంబోతులను చూసి అంత దూరాన తన ద్విచక్ర వాహనాన్ని ఆపేసినా ఆంబోతులు ఒక్కసారిగా పొడుచుకుంటూ వేగంగా వెళుతూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో వెనుక కూర్చొన్న వృద్ధురాలికి గాయాలయ్యాయి. దీంతో తోటి వాహనదారులు ఎవరూ ఆంబోతులను చెదరగొట్టే సాహసం చేయలేకపోయారు. కొద్ది సేపటి తరువాత మళ్లీ ఆంబోతులు మరింత రెచ్చిపోయి పొడుచుకుంటూ రోడ్డు పక్కనే నిలిపి ఉన్న ఆటోను సైతం ఢీ కొట్టడంతో ఆటో అద్దం సైతం ధ్వంసమైంది. దీంతో వాహనదారులు ఆంబోతులను చెదరగొట్టే ప్రయత్నం చేసే లోపు అక్కడి నుంచి వెళ్లిపోవడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు రహదారులపై విచ్చలవిడిగా సంచరించే ఆంబోతులు, ఆవుల కట్టడికి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు వాహనదారులు కోరుతున్నారు. లేకుంటే వాటి దాడిలో గాయపడతామని ఆందోళన వ్యక్తం చేశారు.

తనకు భూమి లేదు... నిరూపిస్తే రాజీనామా చేస్తా

టిడిపి నాయకులకు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సవాల్

జిజిహెచ్‌లో వైసిపి కార్యకర్తలకు పరామర్శ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వినుకొండలో టిడిపి, వైసిపి కార్యకర్తల ఘర్షణలో గాయపడి గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అంకారావును శనివారం నరసరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యేలు బొల్లా బ్రహ్మ నాయుడు, ముస్తఫా, మద్దాల గిరి, ఎమ్మెల్సీ యల్ అప్పిరెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి వారు బాధితుడ్ని అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి వైద్యం సత్వరమే అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్‌కు వారు సూచించారు. అనంతరం నాట్కోలో చికిత్స పొందుతున్న మర్రి అచ్చిరెడ్డిని కృష్ణ దేవరాయలు, బొల్లా బ్రహ్మనాయుడు పరామర్శించారు. ఈ సందర్భంగా బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ వినుకొండలో టిడిపి కావాలనే విధ్వంసం సృష్టించిందన్నారు. తన స్థలంలో అక్రమ మైనింగ్ అంటూ మాజీ ఎమ్మెల్యే జి.వి.ఆంజనేయులు ఎలా తనిఖీలు చేస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం స్థలంలో మైనింగ్ చేస్తే తప్పుపట్టవచ్చు. నా సొంత డైరీ స్థలంలో తనిఖీ చేసే అధికారం ఆయనకు ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. మా ఫ్యాక్టరీలో చొరబడి గేట్లు దూకి సిబ్బందిని బెదిరించారని, సామగ్రి దొంగిలించారని తెలిపారు. ఈ అంశంపై పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశామన్నారు. తర్వాత రోజు తాను సురక్ష కార్యక్రమానికి వెళ్తున్న సమయంలో టిడిపి కార్యకర్తలు 500 మంది తనపై దాడి చేశారని ఆరోపించారు. తనను కాపాడే ప్రయత్నం లో భాగంగా తమ పార్టీ నాయకులకు గాయాలు అయ్యాయని అన్నారు. మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు ముందు ఆయన చరిత్ర తెలుసుకోవాలన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఆయన, ఆయన భార్య చేసిన దందాలు ప్రజలకు తెలియవా అని ప్రశ్నించారు. సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర రైతుల సొమ్ము కోట్లు రూపాయలు దోచుకోలేదా అని ప్రశ్నించారు. హాస్పిటల్ పెట్టి కరోనా టైంలో కోట్ల రూపాయలు దోచుకున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. నాకు ఒక అంగుళం కూడా భూమి లేదు ఉందని నిరూపిస్తే రాజీనామా చేస్తా అన్నారు. వినుకొండ నియోజకవర్గంలో జరిగిన విధ్వంస ఘటనకు చంద్రబాబు నాయకుడు కారణం అన్నారు. లీలావతి అంజనీ ఫౌండేషన్ పేరుతో వచ్చే అక్రమ ఆదాయానికి లెక్కలు బయటపెట్టాలన్నారు. ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు మీడియాతో మాట్లాడుతూ టిడిపి నాయకులు కావాలనే పల్నాడులో అశాంతిని పెంచుతున్నారని అన్నారు. ఎమ్మెల్యేలపై విమర్శలు చేయడం ఎదో కార్యక్రమం పేరుతో శాంతిభద్రతల సమస్య సృష్టించడం పరిపాటిగా మారిందన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎంపి శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే బొల్లా తదితరులు



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న క్లూస్ టీం

వృద్ధురాలిపై అఘాయిత్యం

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన క్లూస్ టీం

ప్రజాశక్తి -పెదనంది పాడు రూరల్

మండలంలోని నాగులపాడులో అనారోగ్యంతో మంచం లోనే ఉన్న 85 సంవత్సరాల వృద్ధురాలను గుర్తు తెలియని దుండగులు శుక్రవారం రాత్రి అఘాయిత్యం చేసి, ఆమె చెవులుకున్న బంగారు దుద్దులను తీసుకెళ్లారు ఈ మేరకు ఆమె కుమారుడు పెదనందిపాడు పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెదనందిపాడు ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ కేసు నమోదు చేశారు. పత్తిపాడు సిఐ సుబ్బారావు ఆదేశాల మేరకు క్లూస్ టీమ్‌ని పిలిపించి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వృద్ధురాలని వైద్య పరీక్షల నిమిత్తం బాపట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితుల కోసం దర్యాప్తు తీవ్రం చేశారు. కార్యక్రమంలో గుంటూరు రూరల్ ఎస్ఐ అశోక్, పెదనందిపాడు ఏఎస్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిందితులను అరెస్టు చేయాలి

సంఘటనపై సిపిఎం ఖండన

నాగులపాడులో వృద్ధ మహిళపై అఘాయిత్య సంఘటన జరిగిన ప్రదేశాన్ని మండల సిపిఎం కార్యదర్శి దో ప్పలపూడి రమేష్ బాబు సందర్శించి, బాధితురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వృద్ధురాలిపై అఘాయిత్యానికి పాల్పడ్డ నిందితులను కఠినంగా శిక్షించాలని పోలీసు వారికి విజ్ఞప్తి చేశారు.

వ్యవసాయ మోటార్ల చోరీ

ప్రజాశక్తి-ఈపూరు

పంట సాగుకు వినియోగించే మోటార్లు చోరి జరిగిన సంఘటన మండల కేంద్రమైన ఈపూరు లో శుక్రవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన కంచర్ల పున్నయ్య, గోగు ఆంజనేయులు, మరికొందరు రైతులకు సంబంధించిన ఏడు వ్యవసాయ మోటార్లను గుర్తుతెలియని దుండగులు చోరీ కి గురయ్యాయి. రోజు మాదిరిగానే పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన రైతులకు ఆ ప్రదేశంలో మోటార్లు లేకపోవడంతో ఆందోళన చెందారు. చోరీ జరిగినట్లు గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతులు తెలిపారు.

జీవ వైవిధ్యం కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత

రాజ్య సభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి



ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

వాతావరణ మార్పులు, అటవీ విస్తీర్ణం తగ్గడం, మానవ కార్యకలాపాలు పారిశ్రామి కరణ, అభివద్ధి కార్యక్రమాల వలన ప్రకతి సంరక్షణ క్షీణించడం జరిగి పులుల సంఖ్య ప్రపంచవ్యాప్తంగా తగ్గిందని రాజ్య సభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి తెలిపారు.. శనివారం అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పర్యావరణ విద్యా పరిషత్తు రూపొందించిన పోస్టర్లను రాజ్య సభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, శాసన మండలి సభ్యులు మర్రి రాజశేఖర్ తో కలిసి ఆవిష్కరించారు అయోధ్య రామిరెడ్డి, రాజశేఖర్ మాట్లాడుతూ భారతదేశంలో జీవ వైవిధ్యం కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.. పులుల సంరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు అందరూ సహకరించాలని కోరారు.. అంతరిం చిపోతున్న జీవ జాతులను సంరక్షించు కోవాల్సిన అవశ్యకత ఉందన్నారు.. ఈ కార్యక్రమంలో పర్యావరణ విద్యా పరిషత్ కోఆర్డినేటర్ డి.తిరుపతి రెడ్డి, వైయస్ఆర్ ఇంటల్ క్చువల్ ఫోరం అధ్యక్షులు జి.శాంత మూర్తి, కబ్బిరెడ్డి పలువురు పాల్గొన్నారు.



పడవ రేవుల తనిఖీ

ప్రజాశక్తి-అచ్చంపేట

పడవలలో ప్రయాణించే ప్రతి ఒక్క ప్రయాణికుడికి లైఫ్ జాకెట్ తప్పనిసరిగా ఉండాలని అచ్చంపేట ఎస్సై సిహెచ్ మణి కృష్ణ పడవల యాజమాన్యాలను ఆదేశించారు. మండలంలో పడవ రేవులను శనివారం ఎస్సై తన సిబ్బం దితో తనిఖీ చేశారు. మాదిపాడు,గింజుపల్లి, తాడువాయి, పొట్లగూడెం, చామర్రు, అంబటిపూడి తదితర రేవులను తనిఖీ చేశారు. రేవులలోని అన్ని పడవలకు లైసెన్సులు ,లైఫ్ జాకెట్లు, ఫిట్నెస్ సర్టిఫికెట్లు పరిశీలించారు. ఈ సంద ర్భంగా నిర్వాహక్కులకు పలు సూచనలు ఇచ్చారు నిబంధ నలకు లోబడి పని చేయాలని చెప్పారు. ఎలాంటి సమస్యలు తలెత్తిన పడవ నిర్వాహకులే బాధ్యత వహించాలని ఎస్సై హెచ్చరించారు. పుట్లగూడెం బలకట్టు పాటదారులుకూ సూచనలు చేశారు.



పులుల సంరక్షణ బాధ్యత అందరిదీ: ఎఫ్ఎస్ఒ

ప్రజాశక్తి-మాచర్ల

అడవిని కాపాడడంలో పెద్దపులులది ఎంతో క్రియాశీలక పాత్ర అని ఎఫ్ఎస్ఒ కె.వెంకయ్య అన్నారు అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా శనివారం దుర్గి బస్టాండ్ సెంటర్‌లో ప్రజా అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ ఒక పెద్ద పులి 2,500 హెక్టార్ల అడవిని కాపాడుతుందని, పులులు ఉంటే అభయారణ్యం పచ్చగా ఉంటుందని చెప్పారు. అడవులు సంరక్షించబడితే పర్యావరణ సమతుల్యత కాపాడబడుతుందని తద్వారా మానవాళికి ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. పులులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, వన్యప్రాణి చట్టాలు చాలా కఠినంగా ఉన్నాయని, ప్రజలు వాటికి ఏమాత్రం హాని తలపెట్టిన కటకటాల పాలు కావాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్లు కోటేశ్వరరావు వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆయుర్వేదం షాప్ ను ప్రారంభిస్తున్న మేనేజర్ శ్రీకాంత్

ముద్ర యోజన' తో యువతకు లోన్

ప్రజాశక్తి-పెదకూరపాడు

ప్రధానమంత్రి ముద్ర యోజన పథకం ద్వారా మండలంలో 60 మంది యువతకు లోన్ సదుపాయం కల్పించామని యూనియన్ బ్యాంక్ మేనేజర్ జి.శ్రీకాంత్ అన్నారు. శనివారం పెదకూరపాడు ప్రభు కాంప్లెక్స్ లో ముద్ర యోజన పథకం కింద ఏర్పాటు చేసిన ఆయుర్వేదం షాప్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లా డుతూ మండలంలోని యువత ఆర్థికంగా స్థిరపడేందుకు, చిరు వ్యాపారులు తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకునేందుకు ఈ పథకం ద్వారా తక్కువ వడ్డీకే ఎలాంటి ష్యూరిటీ లేకుండా రెండు లక్షల వరకు లోన్ మంజూరు చేస్తామని అన్నారు.

పల్నాడులో 1 నుండి యువగళం పాదయాత్ర

- 2న వినుకొండలో బహిరంగ సభ
- పాదయాత్రను జయప్రదం చేయండి
- పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు జివి ఆంజనేయులు

ప్రజాశక్తి-వినుకొండ

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రను వినుకొండ నియోజకవర్గంలో విజయవంతం చేయాలని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీ.వీ ఆంజ నేయులు కోరారు. నూజెండ్ల మండలంలోని గుర్రపునాయుడు పాలెం వద్ద జివి ఆంజనేయులు శనివారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీతో ప్రకాశం జిల్లాలో యువగళం పాదయాత్ర ముగిసి ఆగస్టు 1న పల్నాడు జిల్లాలోకి యువగళం ప్రవేశించనుందని, నూజెండ్ల మండలంలోని ముప్పరాజువారిపాలెం వద్ద ప్రారంభమవుతుందని తెలిపారు. 1వ తేదీ నుండి 6 వరకు వినుకొండ నియోజకవర్గంలో ఈ పాదయాత్ర కొనసాగనుందని, 1వ తేదీ ఉదయం 9 గంటలకు 5000 మందితో లోకేష్ యువగళం పాదయాత్రకు స్వాగతం పలకనున్నట్లు, సమైక్య గుంటూరు జిల్లా నుండి నియోజకవర్గాల ఇన్‌ఛార్జీలు, సీనియర్ నాయకులు, మాజీ మంత్రులు, పొలిట్ బ్యూరో సభ్యులతో పాటు నియోజకవర్గంలోని ఐదు మండలాల నుండి టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పదివేల మంది పాదయాత్రలో పాల్గొంటారని వివరించారు.

1వ తేదీ మధ్యాహ్నం రవ్వారం వద్ద భోజన విరామం , రాత్రికి గుర్రపు నాయుడుపాలెం లో విశ్రాంతి విరామం ఉంటుందని చెప్పారు. రోజుకు 17 కిలోమీటర్లు పాదయాత్ర జరుగుతుందని వివరించారు. ఆగస్టు 2వ తేదీ వినకొండలో సుమారు 50 వేల మందితో బహిరంగ సభ ,బొల్లాపల్లి మండలంలో ఎస్టి గిరిజనులతో సదస్సు జరుగుతుందన్నారు.

6వ తేదీ తర్వాత కారంపొడి నుండి పిడుగురాళ్ల, సత్తెనపల్లి, పెద్దకూరపాడు, నియోజకవర్గాల్లో యువగళం పాదయాత్ర కొనసాగుతుందని అన్నారు. పాదయాత్రకు ప్రజల నుండి అనూహ్య స్పందన వస్తోం దని, అనేక సమస్యలను తెలుసుకొని అవగతం చేసు కుంటూ సమస్యల పరిష్కారానికి ప్రజలకు హామీ ఇవ్వడం కూడా జరుగుతుందన్నారు. ప్రజా సమస్యలపై లోకేష్ స్పందనతో ప్రజల్లో ఉత్సాహం నింపి విశేష ఆదరణ లభిస్తోందని, పల్నాడు ప్రాంతంలో యువగళం పాదయాత్రతో వైసిపి అడ్రస్ లేకుండా పోతుందని అన్నారు. యువగళం రాష్ట్ర యువతలో స్ఫూర్తిని నింపిందని, మూడు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో టిడిపి విజయం సాధించడమే అందుకు నిదర్శనమని అన్నారు. నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాదయాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయ కులు డిఎల్‌డిఎ చైర్మెన్ లగడపాటి వెంకట్రావు, టిడిపి నాయకులు పి. నాగేశ్వరరావు, ఎల్. శ్రీనివాసరావు, జి.చందారావు, ఎం.సుబ్బారావు, జి.చంద్రశేఖర్,ఎం.మురళీకృష్ణ యాదవ్, ఎల్. సూరి,ఎం.ఆంజనేయులు, కె.వెంకటరెడ్డి, ఆర్. వీరాంజనేయరెడ్డి, ఆర్.మల్లేశ్వరరావు, ఎం.ఏడుకొండలు, బి.అంజిరెడ్డి, ఎం.రామ్ బ్రహ్మ, ఎం.సురేష్ పాల్గొన్నారు.



గుర్రపునాయుడుపాలెం వద్ద స్థలపరిశీలన చేస్తున్న జివి ఆంజనేయులు, తదితరులు

ప్రజా పంపిణీ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేయాలి

- బియ్యం అక్రమ రవాణా దారులు,రేషన్ దుకాణాలపై 72 కేసులు నమోదు
- 1302.58 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం
- ప్రజా పంపిణీ వ్యవస్థ పై నిరంతరం నిఘా
- జేసీ ఎ. శ్యాం ప్రసాద్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ సమర్ధ వంతంగా, పారదర్శకంగాను పంపిణీ చేసేందుకు నిరం తరం కృషి చేస్తున్నట్లు పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అన్నారు. ఈ మేరకు శని వారం కలెక్టరేట్‌లో మాట్లాడుతూ రేషన్ సర ఫరాపై నిరంతర నిఘా ఉంటుందని, గత 6 నెలల కాలంలో పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న వారిపై, చౌక దుకాణాలపై 72 కేసులు నమోదు చేసి వారిపై 6ఏ కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. రైస్ బిల్లులపై దాడులు నిర్వహించి 2 కేసులు నమోదు చేశామని 1302.58 క్వింటాళ్లు స్వాధీనం చేసు కున్నామని అన్నారు. జిల్లాలో 10 మండల స్థాయి నిల్వ కేంద్రాలు ఏర్పాటు చేసి 1290 చౌక దుకాణాలకు సరుకులు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. దుకాణాలకు చేరిన సరుకులను 402 ఎమ్డీయ్ ఆప రేటర్ల ద్వారా పంపిణీ చేయడం జరుగుతోందని, ఈ వాహనాలు సక్రమంగా పంపిణీ చేసేలా రూట్ ప్లాన్ అమలు చేస్తామని అన్నారు.ఎన్‌ఫోర్స్‌ఎంట్ డిప్యూటీ తహశీల్దార్ లు రోజుకి 3 చౌక దుకాణాల చొప్పున తనిఖీలు చేస్తున్నారని వివరించారు. నెలలో మొత్తం పరిధిలో ఉన్న అన్ని షాపుల తనిఖీ జరుగుతున్నట్లు చెప్పారు. జిల్లాలో జాతీయ ఆహార భద్రత చట్టం, రాష్ట్ర రేషన్ కార్డులు కింద నెలకు 9096. 365 టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నామని, కిలో బియ్యంపై రూ 39.35 పైసలు చొప్పున కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చు చేస్తున్నాయని, జిల్లాలో మధ్యస్థ సన్న రకం బియ్యాన్ని సార్టెక్స్ చేసి పోర్టిఫైడ్ బియ్యంగా మార్చి కార్డుదారులకు అందజేస్తున్నట్లు చెప్పారు. పోర్టిఫైడ్ బియ్యంలో విటమిన్ డి12, ఫోలిక్ యాసిడ్, ఐరన్ తో జతపరచి ఉంటాయని అన్నారు. రక్త హీనతను అధిగమించేందుకు ఈ బియ్యం ఉపయోగపడతా యని, వీటిని వండేందుకు ప్రత్యేక వంట విధానం ఏమీ అవసరం లేదని, సాధారణ బియ్యం మాదిరి గానే చేయాలన్నారు. బియ్యాన్ని కడిగిన తరువాత నానబెట్టిన అదే నీటిని వంట కోసం ఉపయోగించాలని, గంజి తీయకుండా ఉడికించాలన్నారు. అత్యుత్తమ పోషకాలతో కూడిన బియ్యాన్ని అన్ని వయసుల వారు తీసుకొని మెరుగైన ఆరోగ్యం పొం దాలన్నారు. బియ్యం పంచదారతో పాటు పట్టణ ప్రాంతాల్లో బలవర్ధకమైన నాణ్యమైన గోధుమపిండి ప్యాకెట్ కార్డు ఒక్కొక్కరికి రూ.16 చొప్పున అంద జేస్తున్నామని, 58.096 కార్డుదారులకు గోధుమ పిండి సరఫరా చేశామని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు మండల కార్యదర్శి శ్రీనివాసరావు

సున్నం మిల్లుల కార్మికులకు కూలి రేట్లు పెంచండి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా సున్నం మిల్లుల్లో చేసే కార్మికులకు కూలి రేట్లు వెంటనే పెంపుదల చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో గుంటూరు రోడ్ లోని సున్నం మిల్లుల ఏరియాలో చిట్టిబోయిన గిరిబాబు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ సున్నం పని చేసే కార్మికులకు కనీసం సౌకర్యాలు అమలు కావట్లేదని, మహిళా కార్మికులకు కనీసం మరుగుదొడ్లు, విశ్రాంతి గదులు లేవని, వానొచ్చినా, ఎండొచ్చినా సున్నం కుప్పల పైన, చెట్ల కింద విశ్రాంతి తీసుకోవాల్సి వస్తోందని అన్నారు. ఈ విషయమై ఒప్పందాల సమయాల్లో యాజమాన్యాలకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదనివిమర్శించారు. కార్మికులకు మస్టర్ నిర్వ హించాలని దాని ఆధారంగా దీర్ఘకాలం పని చేసిన కార్మికులకు పిఎఫ్ , ఈఎస్ఐ, సర్వీస్ వంటి చట్టపరమైన సౌకర్యాలు కల్పించాలని చెప్పినా యాజమాన్యం అమలు చేయట్లేదని అన్నారు. అమలు చేయమని లేబర్ డిపార్టుమెంట్‌కి తెలియజేసినా అధికారులు తనిఖీ చేయడం లేదని ఆరో పించారు. ప్రతి కూలి రేట్ల ఒప్పందానికి మధ్య నెలా రెండు నెలలు సమయం వృధా అవుతోందని, యాజమాన్యం వెంటనే కూలి రేట్లు పెంపునకు ముందుకు రావాలని కోరారు. సమావేశంలో సున్నం మిల్లు వర్కర్స్ వై. శివయ్య, పి.వెంకటేశ్వర్లు, డి.హరిబాబు, ఆర్.రామారావు, ఎ.కోటేశ్వరరావు, జయరాజు, కె.సాంబయ్య, పి.నాగరాజు, బి.ఏడుకొండలు,నాగేశ్వరరావు, శ్రీను,కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో విజేత తంగెడ సీనియర్స్ టీమ్

ప్రజాశక్తి- దాచేపల్లి రూరల్

పీర్ల పండుగ సందర్భంగా భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ), భారత ప్రజాతంత్ర యువ జన సమాఖ్య (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో మండల లోని తంగెడలో గత రెండు రోజులుగా నిర్వ హిస్తున్న కబడ్డీ పోటీలు శుక్రవారం రాత్రితో ముగి శాయి. విజేతగా తంగెడ సీనియర్ టీమ్ నిలి చింది. రెండు, మూడు, నాలుగు స్థానాల్లో వరుసగా దాచేపల్లి టీమ్, తంగెడ జూనియర్స్, హుజూర్‌నగర్ టీమ్ నిలిచాయి. కబడ్డీ పోటీలలో పాల్గొనటానికి గురజాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని అనేక గ్రామాలు, పట్టణాల నుండి వచ్చిన టీమ్‌లు పాల్గొన్నాయి. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మాట్లాడుతూ విద్యార్థి , యువజన సంఘాల వారు గత మూడేళ్లుగా కబడ్డీ పోటీలు ఎంతో శ్రమించి చక్కగా నిర్వహిస్తున్నా యని ప్రశంసించారు. ప్రతి ఏటా ఈ పోటీలను వారు నిర్వహించాలని, అందుకు తాము సంపూర్ణ సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు జానీ బాషా, యు.ఎల్లయ్య, సిహెచ్. ఇస్మాయిల్, కె.లక్ష్మీనారాయణ, వై.మని, షేక్ కన్వర్, బి.నాగరాజు, ఎస్ఎఫ్ఐ , డివైఎఫ్ఐ పల్నాడు జిల్లా కార్యదర్శులు కోటా సాయికుమార్, ఆంజనేయరాజు పాల్గొన్నారు.



మణిపూర్ మారణహోమం పాపం బిజెపిదే





మాట్లాడుతున్న పాశం రామారావు

ప్రజాశక్తి-తాడేపల్లి

ఇటీవల మణిపూర్‌లో సభ్య సమాజం తలదించుకునే విధంగా జరిగిన మారణహోమానికి కేంద్రంలో మోడీ సారథ్యంలో ఉన్న బిజెపి ప్రభుత్వ పాపమేనని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు విమర్శించారు. శనివారం రాత్రి పట్టణంలోని పోలకంపాడు పుష్కర కాలనీలో మణిపూర్ మారణహోమంపై జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హిందూ మతోన్మాదం యొక్క విశ్వరూపం ఏవిధంగా ఉంటుందో దేశం మొత్తం చూసిందని చెప్పారు. రెండు తెగల మధ్య వచ్చిన సమస్యను సామరస్యంగా పరిష్కరించాల్సిన ప్రభుత్వం మెజార్టీ వర్గీయులుగా ఉన్న వారిని రెచ్చగొట్టి హిందుత్వాన్ని ఉపయోగించి మారణకాండ సృష్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నడిరోడ్డుపై మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించి అత్యాచారం చేయడం ఆటవిక పద్ధతులను తలపిస్తుందని ఆగ్రహం తెలిపారు. కౌరవ సభలో ద్రౌపదిని వివస్త్రను మాత్రమే చేశారని, నేటి అభినవ బిజెపిసేన మహిళలను వివస్త్రలను చేసి మానభంగం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దుశ్చర్యను ఖండించడానికి మాటలు చాలవని, బి జె వి పాలనలో మానవత్వం మంటగలిసిందని దుయ్యబట్టారు. ఈ మారణకాండ దేశానికి తెలియకుండా రెండు నెలల పాటు స్థానికంగ ఇంటర్నెట్ సేవలు నిలుపుదల చేశారని తెలిపారు. ఈ ఘోరానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడానికి వెనకడుగు వేసిన బిజెపి ప్రభుత్వం ఈ దాష్టికాన్ని వీడియో తీసి ప్రపంచానికి తెలియజేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేయడం దుర్మార్గమన్నారు. ఇటువంటి దురాఘతాలను ప్రజలంతా ఐక్యంగా ఎదుర్కోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎంపట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కొట్టె కరుణాకరరావు, కెఎల్‌రావు కాలనీ కార్యదర్శి కె.మేరి, సామ్యేలు, కార్తీ, కాళిదాసు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు

మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటనలు, అత్యాచారాలకు ఆ రాష్ట్ర, కేంద్రం ప్రభుత్వాలే కారణమని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. నోరు విప్పకుండా, నిర్లిప్తంగా ఘోరాలు జరగటానికి సహకరించిన ఆ ప్రభుత్వాలే అసలు దోషులన్నారు. అవగాహన ఆధ్వర్యంలో అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో మణిపూర్ హింసాకాండను నిరశిస్తూ జరిగిన సభకు ఏపీ లీగల్ ఫోరం కన్వీనర్ అవధానుల హరి అధ్యక్షత వహించారు. సభలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ మణిపూర్ హింస ప్రమాదవశాత్తూ జరిగింది కాదని, ప్రభుత్వ ప్రోద్బలం, ఆశీస్సులతో ఆదిపత్య వర్గం బలహీనులపై చేస్తున్న దాడిగానే చెప్పాలన్నారు. మణిపూర్ జనాభాలో 54 శాతానికిపైగా ఉన్న మైతీలకు, కుకీ, నాగా గిరిజన తెగలకు మధ్య అక్కడి రాష్ట్ర ప్రభుత్వం తన రాజకీయ లబ్ది కోసం చిచ్చుపెట్టడమే ఈమంటలకు కారణమన్నారు. రెండున్నర నెలలుగా అక్కడ మారణహోం జరుగుతున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రి అందరికందరూ మౌనం వహించటం దారుణం అన్నారు. మణిపూర్‌లో మహిళల శరీరాలు రాజకీయ మరణాలకు యుద్ధభూములు అవటానికి మణిపూర్ ముఖ్యమంత్రి ప్రధాని కారకులన్నారు. ఆలిండియా ప్రోగ్రెసివ్ ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షులు ఎస్.హనుమంతరెడ్డి మాట్లాడుతూ బిజెపి, ఆర్ఎస్ఎస్ దుర్మార్గాలకు బలవుతున్న మణిపూర్ ప్రజలకు భారత దేశం మొత్తం అండగా ఉండాలన్నారు. ఈ సభలో ప్రొఫెసర్ ఎన్.రంగయ్య, ప్రొఫెసర్ ఎన్.వేణుగోపాలరావు, ప్రముఖ విశ్లేషకులు గూడవల్లి నాగేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.





నిడమర్రులో క్యాండిల్స్ ర్యాలీ

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

మణిపూర్ ఘటనను నిరసిస్తూ మండలంలోని నిడమర్రు గ్రామంలో శనివారం క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం రవి, ఎం భాగ్యరాజు మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో మైతీలను రెచ్చగొట్టి మైనార్టీలుగా ఉన్న గిరిజన తెగలపై మారణ హోమం సృష్టిస్తున్న బిజెపి మూకల కుట్రలను ఖండించాలని పిలుపు నిచ్చారు. మణిపూర్‌లో నరమేధం సృష్టిస్తున్న నరరూప రాక్షసులను కఠినంగా శిక్షించాలన్నారు. శాంతిభద్రతలను కాపాడలేని రాష్ట్ర బిజెపి ముఖ్యమంత్రి తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మండుతున్న మణిపాల్‌ను కనీసం ప్రధాన మంత్రి సందర్శించలేదని విమర్శిం చారు. దేశ ప్రతిష్ట దిగజార్చిన బిజెపిని ఆంధ్ర ప్రదేశ్‌లో అధికార పార్టీ వైసిపి, ప్రతి పక్షపార్టీ టిడిపి, జనసేన పార్టీలు భుజాన ఎత్తుకుంటున్నాయని ఎద్దేవా చేశారు. నిరంకుశత్వం, మతోన్మాద పోకడలతో పెట్రేగిపోతున్న బిజెపి నుండి భారతదేశాన్ని కాపాడు కునేందుకు ప్రజలు సిద్ధం కావాలన్నారు. నిరసన కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాజధాని డివిజన్ నాయకులు కట్టె పోగు ప్రకాశరావు, మహిళా సంఘం రాజధాని డివిజన్ కార్యదర్శి కె బ్యూల, రైతు సంఘం నాయకులు కే నాగేశ్వరరావు, డివైఎఫ్ఐ రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం ప్రసన్నకుమార్ లు మాట్లాడుతూ మణిపూర్ లో బిజెపి సాగిస్తున్న మారణకాండను ఖండించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ జి జోసెఫ్, ఉన్నం ప్రతాప్, గైరబోయిన నాగేశ్వరరావు, కుంపటి వీరయ్య, వంశీ కుమార్, కడవకొల్లు శ్రీనివాసరావు, కైలా స్టాలిన్, ఎం అంకమ్మరావు, మరియదాస్, కే మాధవి, ఎం అనిల్ కుమార్ పాల్గొన్నారు.

పొనుగుపాడులో మానవ హారంతో నిరసన

ప్రజాశక్తి-ఫిరంగిపురం

ఫిరంగిపురం మండలం పొనుగుపాడు గ్రామ సెంటర్‌లో సిఐటియు, రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్ వలి మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో మైతీలను రెచ్చగొట్టి మైనార్టీలుగా ఉన్న గిరిజన తెగలపై మారణ హోమం సృష్టిస్తున్న బిజెపి మూకల కుట్రలను ఖండించాలన్నారు. మణిపూర్లో అమానవీయ ఘటనకు పాల్పడిన నరరూప రాక్షసులను కఠినంగా శిక్షించాలని, శాంతిభద్రతలను కాపాడలేని రాష్ట్ర బిజెపి ముఖ్యమంత్రి తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సహాయక శిబిరాల్లో తలదాచుకుంటున్న బాధితులకు మిలిటరీ ద్వారా రక్షణ కల్పించాలన్నారు. మోడీ పాలనలో బేటి బచావో అంటే మహిళల బట్టలను ఊడదీసి నగ్నంగా ఊరేగించడమేనా అని ప్రశ్నించారు. బిజెపి పరిపాలనలో మణిపూర్‌లో గిరిజనులపై జరుగుతున్న నరమేధాన్ని ఐక్యరాజ్యసమితితో సహా ప్రపంచం దేశాలు నిరసిస్తున్న సిగ్గు తెచ్చుకొని బిజెపి పాలకులు, 90 రోజుల నుండి బిజెపి పాలిత రాష్ట్ర మణిపూర్ రావణ కాష్టంలా కాలిపోతున్న అటువైపు తొంగి చూడని దేశ ప్రధాని మోడీ, దేశ ప్రతిష్ట దిగజార్చిన బిజెపిని భుజాన ఎత్తుకుంటున్న ఏపీలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు పచ్చి నిరంకుశత్వం, మతోన్మాద పోకడలతో పెట్రేగిపోతున్న బిజెపి నుండి భారతదేశాన్ని కాపాడుకునేందుకు ప్రజలు సిద్ధం కావాలన్నారు. నిరసన లో రైతు సంఘం మండల కమిటీ సభ్యులు గుంటుపల్లి వెంకటేశ్వరరావు, పి వంశీ యామిని, తులసీరామ్ మరియు పాఠశాల బాలబాలికలు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆత్మకూరు ముంపు బాధితులకు

సిపిఎం నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

గత వారం రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు, సంఘటిత, అసంఘటితరంగా కార్మికులు చాలా ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. ఎంటిఎంసి పరిధిలోని ఆత్మకూరు లోని పారిశుధ్య కార్మికులు నివసించే ప్రాంతంలోని ఇళ్లల్లోకి వరదనీరు చేరి నివసించడానికి కూడా వీలు లేకుండా కట్టుబట్ట లతో రోడ్లమీదకి రావాల్సిన పరిస్థితిలో ఉన్నారు. ఈ క్రమంలో శనివారం సిపిఎం నాయకులు ఆత్మకూరులో కార్మికుల నివాస ప్రాంతాలను పరిశీలించారు. వారికి ఐదు కేజీల బియ్యం, రెండు కేజీల కూరగాయలు, ఉల్లిపాయలు, పచ్చడి డబ్బాలు, కారం, పెరుగు ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మొసలి పకీరయ్య మాట్లాడుతు వరద బాధితులను రాష్ట్ర ప్రభుత్వం సత్వరం ఆదుకోవాలని కోరారు. గతంలో అనేక విపత్తులు సంభవించినపుడు సిపిఎం పేదలను ఆదుకోవడం లో ముందుందని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి వుద్దంటి దుర్గారావు, పండల ప్రసాదు, చిట్టేల



జనార్ధనరావు, చిట్టేల సీతారామాంజ నేయులు, పులివర్తి ప్రసాదు కాండ్రు ఆంజనేయులు, బిట్ర రాంబాబు, దేపూరు పద్మనాభ శర్మ, మునగాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రెండేళ్లుగా అసైన్డ్ రైతుల ఎదురు చూపులు

సిఐడి విచారణ పేరుతో తీవ్ర జాప్యం

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని ప్రాంతంలోని అసైన్డ్ రైతులకు కౌలు సొమ్ము కోసం ఎదురు తెన్నులు తప్పడం లేదు. కొద్దిపాటి అసైన్డ్ భూములను రాజధాని నిర్మాణానికి ఇచ్చిన దళితులు, ఇతర పేదలకు రెండేళ్లు దాటినా కౌలు సొమ్ము అందలేదు. అసైన్డ్ భూముల వ్యవహారంలో అవకతవకలపై సిఐడి విచారణ జరుగుతోందంటూ ప్రభుత్వం కౌలు చెల్లింపులో తీవ్ర జాప్యం చేయడం పై అసైన్డ్ రైతులు మండిపడుతున్నారు. ప్రతి ఏటా మే, జూన్ నెలలో కౌలు సొమ్ము చెల్లించాల్సి ఉండగా గతేడాదితో పాటు ఈ సంవత్సరం కౌలు కూడా ఇప్పటివరకు దక్కలేదు. ఎన్నో ఆందోళనల తరువాత సిఆర్‌డిఎ అధికారులు ఈ నెల 21న అసైన్డ్ కౌలు విషయమై ఒక ప్రకటన చేశారు. 1751 ఎకరాల అసైన్డ్ భూములకు సంబందించిన వివరాల కోసం జూలై 3న సిఆర్‌డిఎ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్‌కు లేఖ రాయడం జరిగిందని తెలిపారు. అసైన్డ్ భూములకు సంబందించిన ఒరిజినల్ లేదా సర్టిఫైడ్ కాపీలు లేనందున అసైన్డ్ వివరాలను ధవీకరించాలని కోరడం జరిగిందని తెలిపారు. ఈ నేపథ్యంలో అసైన్డ్ భూముల ధవీకరణ ప్రక్రియ ఎప్పటికి పూర్తవుతుందోనని అసైన్డ్ రైతులు ఎదురు చూస్తున్నారు. సిఐడి విచారణ పేరుతో ఏళ్ల తరబడి జాప్యం చేసిన ప్రభుత్వం ధ్రువీకరణ ప్రక్రియ పూర్తి కావాలంటూ మరికొంత కాలం దాటవేసేందుకు యత్నిస్తోందని అసైన్డ్ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంజాయ్ మెంట్ సర్వే ప్రకారం అసైన్డ్ రైతులకు గత టిడిపి ప్రభుత్వం ఐదేళ్లు, వైసిపి ప్రభుత్వం రెండేళ్లు కౌలు చెల్లించాక ఇప్పుడు ఒరిజినల్ పత్రాలు సమర్పిస్తేనే కౌలు చెల్లించడం జరుగుతుందని ప్రభుత్వం, సిఆర్‌డిఎ అధికారులు చెప్పడం ఏమిటని తుళ్లూరుకు చెందిన అసైన్డ్ రైతులు మేరిగ నాగేశ్వరరావు, జొన్నకూటి ఏడుకొండలు, అనంతవరంకు చెందిన శానం జక్రయ్య ప్రశ్నించారు. రాజధానిలో వ్యవసాయ పనులు లేక, ఉపాధి కరువై అసైన్డ్ రైతులైన దళితులు, ఇతర పేదల జీవనం కష్టంగా మారిందని, సంబంధిత అధికారులు అసైన్డ్ ధ్రువీకరణపై ప్రత్యేక దష్టి సారించి సత్వరమే కౌలు చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని అసైన్డ్ రైతులు కోరుతున్నారు.


అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్‌డిఒ

రేపూడిలో వివిప్యాట్ గోడౌన్‌ను పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు నెలవారీ తనిఖీలలో భాగంగా ఫిరంగిపురం మండలం, రేపూడి మార్కెట్ యార్డ్ గోడౌన్‌లో భద్రపరచిన వీవీప్యాట్ లను శనివారం గుంటూరు రెవిన్యూ డివిజనల్ అధికారి ప్రభాకరరెడ్డి తనిఖీ చేశారు. గోడౌన్ వెలుపల ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పని తీరును పరిశీలించారు. వీవీప్యాట్ గౌడన్ భద్రత విషయంలో రాజీపడకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ ఏడీ కె.కష్ణారెడ్డి, ఫిరంగిపురం ఇన్‌చార్జి తహశీల్దార్ రాజారమేష్, ఆర్.ఐ.రహమాన్, విఆర్ఒ రామాంజీ, కలెక్టరేట్ హెచ్.సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మంగళగిరిలో చేనేతల సదస్సు

ప్రజాశక్తి-మంగళగిరి

చేనేత కేంద్రమైన మంగళగిరిలో ఆదివారం ఉదయం 11 గంటల నుండి సాయంత్రం ఏడు గంటల వరకు మంగళగిరి బైపాస్ రోడ్డులో గల ఆర్ఆర్ కన్వెన్షన్ లో వరల్డ్ వీవర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరుగుతుందని ఆర్గనైజేషన్ వ్యవస్థాపక చైర్మన్ కర్నాటి అంజన్ శనివారం తెలిపారు. ఈ సదస్సులో చేనేత ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల్లో ప్రముఖులు, ఎన్నారైలు పాల్గొంటారని తెలిపారు.

యుసిసి అమలు సాధ్యం కాదు

రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు

ప్రజాశక్తి-అమరావతి

స్థానిక తల్లం బ్రహ్మయ్య స్మారక భవన్‌లో శనివారం యూనిఫామ్ సివిల్ కోడ్ (యుసిసి)పై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. షేక్ మొహిద్దీన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు జి.రవిబాబు మాట్లాడుతూ భారతదేశంలో విభిన్న మతాలు సాంప్రదాయాలు,ఆచారాలు ఉన్న సమాజంలో ఏకరూప పౌరస్మృతి సాధ్యం కాదని అన్నారు. 21వ లా కమిషన్ యుసిసిని అమలు చేయడం సాధ్యం కాదన్న విషయాన్ని గుర్తుచేశారు. 22 లా కమిషన్ వేసి యుసిసి ఎలా ఉంటుందో చెప్పకుండా, ప్రజల ముందుకు చర్చ తీసుకు రావడం గందరగోళానికి గురి చేయడమేనని విమర్శించారు. ముస్లిం మహిళలకు విముక్తి కలిగించడానికి దీనిని తీసుకొస్తున్నామని మాట్లాడటం సబబు కాదని, మతాల మధ్య చిచ్చు రాజేయడమేనని విమర్శించారు. హిందూ మతంలోనే దక్షిణాది ప్రాంతంలో ఒకరకంగా, ఉత్తరాది ప్రాంతంలో మరో రకంగా ఆచార సాంప్రదాయాలు ఉన్నాయని, హిందూమతంలోనే ఇది సాధ్యం కాదని తెలిసినా చర్చ పెట్టించారని విమర్శించారు. ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాలో భాగంగా మాత్రమే కేంద్ర ప్రభుత్వం యుసిసిని ముందుకు తీసుకు వచ్చిందని, లౌకికవాదులు, ప్రజాస్వామ్యకువాదులు ఇటువంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆర్‌ఎస్‌ఎస్ నుండి దేశాన్ని కాపాడుకోవడానికి ముందుకు రావాలని, సమానత్వం సాధించడానికి పాలకులపై ఒత్తిడి తీసుకురావడానికి దృష్టి పెట్టాలని కోరారు. సమావేశంలో వివిధ సంఘాల ప్రతినిధులు బి. సూరిబాబు, డి.ప్రసాద్, పి.రోషిబాబు, బి.వెంకటేశ్వరరావు, టి.సుబ్బారావు, ఎస్. రాజ్‌కుమార్, టి.ప్రదీప్,ఎన్. వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు..


రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న సంఘాల ప్రతినిధులు

1 నుండి మిషన్ ఇంద్ర ధనూష్

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ జి.శోభారాణి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షణలో మిషన్ ఇంద్ర ధనూష్ కార్యక్రమం ఆగస్టు 1 నుండి నిర్వహించనున్నట్లు పల్నాడు వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ జి.శోభారాణి చెప్పారు. శనివారం ఆమె మాట్లా డుతూ ప్రతి గ్రామంలో ఆశా కార్యకర్తలు వారి పరిధిలో ఉన్న వ్యాధి నిరోధక టీకాలు పొందని, మధ్యలో టీకాలు ఆపివేసిన గర్భిణులను, ఐదేళ్ల లోపు పిల్లలను ఇం టింటి సర్వే ద్వారా ఇప్పటికే గుర్తించామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 54 మంది గర్భిణులు, ఐదేళ్ల లోపు పిల్లలను 776 మందిని గుర్తించినట్లు చెప్పారు. ఆగస్టు 7 నుండి 12 వరకు ప్రత్యేకమైన 346 వ్యాధి నిరోధక సెషన్లు, 327 మంది ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తల ద్వారా అర్హత ఉన్న గర్భిణులు, ఐదేళ్లలోపు చిన్నారులకు టీకాలు వేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమం సెప్టెంబర్ 11 నుండి 16 వరకు, అక్టోబం 9 నుండి 14 వరకు నిర్వహించనున్నట్లు వివరిం చారు. ముఖ్యంగా సంచార జాతులు, కర్మాగారాల్లో పని చేసే ఇతర రాష్ట్ర కార్మికులను, వలస కూలీలు, పట్టణ, మురికివాడలలో నివసించే వారిని గుర్తించనున్నట్లు చెప్పారు. సీజనల్ వ్యాధులు సోకకుండా చిన్నారులకు, వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించి తద్వారా వారిని ప్రాణాంతక వ్యాధుల బారి నుండి రక్షించాలన్నారు. మరిన్ని వివరాలకు ఆయా పరి ధిలోని సామాజిక ఆరోగ్య కేంద్ర అధికారి, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలను సంప్రదించాలని సూచించారు.



వైద్య సేవలపై ప్రశంసలు

ప్రజాశక్తి-రెంటచింతల

మండల కేంద్రమైన రెంటచింతలలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జాతీయ నాణ్యత ప్రమాణ సభ్యుల బృందం రెండో రోజైన శనివారం పరిశీలన చేసి మంచి ప్రమాణాలను పాటిస్తున్నారని కితాబిచ్చారు. అనంతరం డాక్టరు రాజ్ కుమార్,డాక్టర్ ఆరోగ్ మారి(న్యూఢిల్లీ) మాట్లాడుతూ 2014లో జాతీయ నాణ్యత ప్రమాణాల హామీ కార్యక్రమాన్ని ప్రారంభించారని 80 శాతం మెరుగైన సేవలు రోగులకు అందినట్లయితే సర్టిఫికెట్ ప్రదానం చేస్తారని, దాని ద్వారా ప్రతి సంవత్సరం మూడు లక్షలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఇస్తారని అన్నారు. ఓపి, ఇన్ పేషెంట్ సేవలు, రక్త పరీక్షలు మందుల పరిపాలన విభాగాల ను పరిశీలించి సంతప్తిని వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీపీ దాసరి చౌడేశ్వరి బృందాన్ని ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో డాక్టర్లు కష్ణారెడ్డి, హేమ, సిహెచ్‌ఓ నాగేశ్వరరావు, నాగరాజు, ఆశ వర్కర్లు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



సురక్ష ద్వారా తక్షణమే అర్జీల పరిష్కారం

ప్రజాశక్తి-అమరావతి


మండల పరిధిలోని మల్లాదిలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాన్యుల సమస్యల పరిష్కారానికి అండగా నిలిచిన సురక్ష కార్యక్రమం అద్భుతమైన ఫలితాలు సాధించిందని అన్నారు. కార్యక్రమంలో 5017 అర్జీలు వచ్చాయని, వాటిని సత్వరమే పరిష్కరించినట్లు చెప్పారు.



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి -నాదెండ్ల

మండలంలోని గొరిజవోలు గ్రామంలో శుక్రవారం రాత్రి కొండెబోయిన కోటేశ్వరరావు గృహం అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. ఈ విషయం తెలుసుకున్న జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్ సైదా కోటేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కంజుల వీరారెడ్డి , వైసిపి మాజీ మండల అధ్యక్షులు గొంటు శ్రీనివాస రెడ్డి,15 వ వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, నార్నె హనుమంతరావు, కొక్కిరి చిట్టిబాబు ,పట్నం కరిముల్ల పాల్గొన్నారు


నాగార్జున యాదవ్ ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

ఏపీఈడబ్ల్యూఐడిసి చైర్మన్‌గా నాగార్జున యాదవ్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్‌ను ఆంధ్రప్రదేశ్ విద్య %ు% సంక్షేమ, మౌలిక వసతుల కార్పొరేషన్ (ఏపీఈడబ్ల్యూఐడిసి) చైర్మన్ గా యనమల నాగార్జున యాదవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నాగార్జున శనివారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నాగార్జున యాదవ్ ను షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఖాజావలి మాస్టర్, ఎంపిపి మూరబోయిన శ్రీనివాసరావు , జడ్పిటిసి పదముత్తం చిట్టిబాబు, వైస్-ఎంపీపీ వెంకటప్ప రెడ్డి, మూరే రవీంద్ర, కనక పుల్లారెడ్డి, బీరం భాస్కర్ రెడ్డి, హనిమిరెడ్డి, స్థానికమ్మ కోటిరెడ్డి, కారుమంచి మీరావలి తదితరులు పాల్గొన్నారు.

అందమైన చేతిరాత కోసం ...

ప్రజాశక్తి- దాచేపల్లి

స్థానిక స్కాలర్స్ పాఠశాలలో అందమైన చేతిరాత కోసం రామమోహన్‌రావు ఆధ్వర్యంలో క్రమశిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 100 మంది విద్యార్థులు, 48 టీచర్స్ పాల్గొన్నారు. మోహన్ రావు మాట్లాడుతూ పదివేల మంది ఉపాధ్యాయులు, లక్ష మంది విద్యార్థుల చేతిరాత మార్చడం తమ లక్ష్యంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఈపీఎఫ్ జిల్లా కార్యదర్శి వి.నాగేశ్వరరావు, డాక్టర్ బి.చిన్నమ్మ, షేక్ మస్తాన్ వలి, రెంటచింతల ఈటీఎఫ్ ఇన్‌ఛార్జి రాజ్ కుమార్, సాగర్ బాబు, వసంత కుమారి, దాచేపల్లి ఇన్‌ఛార్జి పి.రాజారావు, వెంకట్రావు, శ్యాంబాబు, స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, స్కాలర్స్ ప్రిన్సిపాల్ రంగారెడ్డి పాల్గొన్నారు.



జెఎసి మీడియా ఇన్‌ఛార్జిగా కటారి సుధాకర్

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చిలకలూరిపేట నియోజకవర్గ ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా కాపు జెఎసి మీడియా ఇన్‌ఛార్జిగా కటారి సుధాకర్ ను నియమించినట్లు రాష్ట్ర జె.ఏ.సి. చైర్మన్ అమ్మా సినిబస నాయుడు ఒక ప్రకటనలో శనివారం తెలిపారు.ఈ మేరకు నియామకపు ఉత్తర్వులు వెలువడినట్లు తెలిపారు.

ప్రజాశక్తి-మాచర్ల

పట్టణంలో ముస్లింలు భక్తి శ్రద్ధలతో మొహరం వేడుకలు జరుపుకున్నారు. పెద్దల స్మరించుకుంటూ పీర్లను ఘనంగా ఊరేగించారు ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ,వైసిపి రాష్ట్ర యువజన కార్యదర్శి వెంకట్రామిరెడ్డి మున్సిపల్ చైర్మన్ తురక కిశోర్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డిలు మొహరం శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా మొహర్రం వేడుకలు

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని గ్రామాల్లో మొహర్రం పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు.పీర్ల శావిడల వద్ద పిల్లలు,పెద్దలతో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పీర్లను ఉరేగింపు నిర్వహించారు.





సత్తెనపల్లిలో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

రాష్ట్ర ప్రజల భవిష్యత్తు జగన్మోహన్ రెడ్డి నాశనం చేశారని సత్తెనపల్లి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సత్తెనపల్లి పట్టణంలోని 23వ వార్డుల్లో టిడిపి ఆధ్వర్యంలో భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు.

బాధిత రైతులకు మాజీ ఎమ్మెల్యే సాయం

ప్రజాశక్తి-పెదకూరపాడు

మిర్చి బాధిత రైతులకు పెదకూరపాడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ రూ.1,50,000 ఆర్థిక సహాయం చేశారు. శనివారం గడ్డి మందు ప్రయోగించబడిన మిరప నర్సరీని ఆయన పరిశీలించారు. పెదకూరపాడు ప్రాంతంలో నర్సరీపై గడ్డి మందుకారి చేయడం సంచలనం కలిగించింది. ఆ నర్సరీ మొత్తం చిన్న, సన్న, కౌలు రైతులు నాటుకున్నారు. రైతులందరూ ఐక్యంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు ఆర్తిమళ్ళ రమేష్, బెల్లంకొండ రాంగోపాలావు, భాష్యం ఆంజనేయులు, షేక్ మిలట్రీ మౌలాలి, షేక్ ముంతాజు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి బూత్ లెవెల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండండి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా



ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో వాలంటీర్ల పాత్ర ఉండకూడదని, నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా జాబితా సవరణలో అక్రమాలకు పాల్పడితే జిల్లా కలెక్టర్,పార్టీ కార్యాలయానికి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయాలని టిడిపి నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు సూచించారు. స్థానిక గుంటూరు రోడ్డులోని టిడిపి కార్యాలయంలో శనివారం టిడిపి ముఖ్య నాయకులు క్లస్టర్, బూత్, యూనిట్ ఇంఛార్జీల సమావేశం నిర్వహించారు. అరవిందబాబు మాట్లాడుతూ గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు కింది స్థాయి అధికారుల పై ఒత్తిడి తెచ్చి ఓటరు జాబితాలో అవకతవకలకు పాల్పడుతున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటివి గుర్తించి బీఎల్ఎలు,పార్టీ నాయకులు వెంటనే 9182981134 నంబర్ కి వాట్సాప్ ద్వారా సమాచారాన్ని పంపించాలని సూచించారు.

1న శాంతియుతంగా రైతు యాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రాజమోహన్ రావు

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడిగింపు పనులకు నిధులు కేటాయించాలని కోరుతూ ఆగస్టు 1వ తేదీన పెదనందిపాడు నుండి శాంతియుతంగా రైతులు యాత్రగా వెళ్లి ముఖ్యమంత్రికి వినతిపత్రాన్ని అందించేందుకు నల్లమడ రైతు సంఘం ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా ఏర్పాటు చేసిన రైతు యాత్ర లో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజమోహన రావు కోరారు. శనివారం పెదనందిపాడు కామ్రేడ్ కొల్లా వెంకయ్య గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 50 వేల ఎకరాలకు సాగునీరు 50 గ్రామాలకు త్రాగునీరు అందించే ఈ ప్రాజెక్టు గతంలో ముగ్గురు ముఖ్య మంత్రులు మాట ఇచ్చి నిలుపుకోలేకపోయారని .నేటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ ప్రాజెక్టు నిధులు మంజూరు చేసి సహకరించాలని కోరారు. శాంతియుతంగా జరపనున్న ఈ రైతు యాత్ర పదవుల కోసం కాదన్నారు. ఒకటవ తేదీన రైతులంతా ఉదయం 9 గంటలకు పెదనందిపాడు చేరుకోవాలని ,ఇక్కడ నుండే రైతు యాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు. తాము చేసేది దండయాత్ర కాదని సాగు, తాగు నీరు కోసం శాంతియుతంగా చేస్తున్న రైతు యాత్రకు అధికారులు ప్రజానాయకులు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘ కార్యదర్శి వై అంకమ్మ చౌదరి. బండి నాగేశ్వరరావు .మన్నవ హరిప్రసాద్. లావు అంకమ్మ చౌదరి. మొవ్వా పెద్దన్న. కొల్లా రామన్. దోప్పలపూడి మంజుల. దివి ప్రమీల. కె.రత్నకుమారి .ఎల్ చౌదేశ్వరి .టి రమాదేవి. టి సరళాదేవి. పి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

ప్రజాశక్తి-మంగళగిరి

సమాజంలో మానవ అక్రమ రవాణాను అరికట్టడానికి ప్రతి ఒక్కరు కషి చేయాలని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అన్నారు. శనివారం స్థానిక పెన్షనర్స్ హాల్లో అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని గుడ్ షెఫర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి స్వచ్ఛంద సంస్థ సిస్టర్ ఉదయ అధ్యక్ష వహించారు. తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకున్నప్పటికీ, ప్రజల్లో కూడా చైతన్యం వస్తేనే అరికట్టడం సాధ్యపడుతుందని అన్నారు. పట్టణ ఎస్ఐ వై కోటేశ్వరావు మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా కొంతవరకు అరికట్టగలిగామని, పూర్తిగా అరికట్టాలంటే సమాజంలో పేదరికం తగ్గిపోవాలని అన్నారు. శ్రీ లక్ష్మీనరసింహ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ మేకల మోహన్ రావు మాట్లాడుతూ సినిమాలు, టీవీ సీరియల్స్ ప్రభావం సమాజంలో పడటం వలన ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రత్నకుమారి, చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు ఇంచార్జి సిస్టర్ లతా, ప్రముఖ న్యాయవాది ఎం గోవర్ధన్ రావు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి నాగమణి తదితరులు పాల్గొన్నారు.



కెఎల్ యులో 2009-13 పూర్వవిద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

దేశ విదేశాల్లో స్థిరపడిన వారంతా మళ్లీ ఒక్క చోట కలుసుకున్నారు. తమతో కెఎల్ విశ్వవిద్యాలయంలో చదువుకున్న తమ పాత స్నేహితులను కలుసుకునేందుకు సరిగ్గా పదేళ్ల తరువాత ఒక్క చోటకు చేరారు. యూనిర్శిటీలో కలిసి చదువుకున్న ఆ పాతమధురాలను గుర్తు చేసుకుని మళ్లీ చిన్నపిల్లలయ్యారు. రోజూ సార్, మేడం అనే పలకరింపులకు సెలవు పలికి ఏంట్రా, ఏమే అంటూ ఆత్మీయ పలకరింపులతో పులకరించిపోయారు. పూర్వ విద్యార్థుల పలకరింపుతో కెఎల్ విశ్వవిద్యాలయంలో సందడి వాతావరణం నెలకొంది. 2009-2013వ సంవత్సరంలో కెఎల్ డీమ్డ్ యూనిర్శిటీలో ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ చదివి, పాసయిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని శనివారం కెఎల్ యూనివర్శిటీ ఘనంగా నిర్వహించింది. ఈ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి పూర్వ విద్యార్థుల సమాఖ్య డైరెక్టర్ డాక్టర్ కె.సిహెచ్.శ్రీకావ్య కన్వీనర్ గా వ్యవహరించారు. వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, పూర్వవిద్యార్థులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విసి డాక్టర్ పార్థసారదివర్మ మాట్లాడుతూ గతంలో ఇదే యూనిర్శిటీలో చదువుకుని దశాబ్ద కాలం తరువాత అందరూ ఎంతో అభివద్ధి చెంది తిరిగి ఇక్కడ కలుసుకుని ఒకరిని ఒకరు ఆత్మీయ పలకరింపులతో గడపడానికి వచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు.

టిడిపి కార్యకర్తలను పరామర్శించిన మన్నవ



జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న టిడిపి కార్యకర్తను పరామర్శిస్తున్న మన్నవ మోహనకృష్ణ

ప్రజాశక్తి-గుంటూరు

వినుకొండలో వైసిపి కార్యకర్తల దాడిలో గాయపడ్డ, జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న టిడిపి కార్యకర్తలను టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ పరామర్శించారు. గంగినేని ఆంజనేయులు, బాల గురవయ్య, జి.వీరంజికుమార్, తూమాటి కాశీలను మోహనకృష్ణ పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. గాయపడిన కార్యకర్తలకు అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న టిడిపి కార్యకర్తలపై వైసిపి నాయకులు దౌర్జన్యం చేసి, పచ్చని పల్నాడులో విధ్వంసం సృష్టించారన్నారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడి అవినీతిని ప్రశ్నిస్తున్నారనే పథకం ప్రకారమే టిడిపి శ్రేణులపై దాడులు చేశారన్నారు. అవినీతిని ప్రశ్నిస్తే దాడులు చేయటం, అక్రమ కేసులు పెట్టటం దుర్మార్గం అన్నారు. వైసిపి అల్లర్లకు భయపడేది లేదని, ప్రజలు టిడిపి వెంట ఉన్నారన్నారు.

కత్తి పద్మారావు పుట్టినరోజు వేడుకలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

ప్రముఖ కవి, రచయిత కత్తి పద్మారావు పుట్టినరోజు వేడుకలు శనివాం పొన్నూరు లోని ఆయన స్వగృహంలో జరిగాయి. ఈ సందర్భంగా ఆయన ఇంట్లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆయన స్ఫూర్తితో ,వారి ఆశయాలను కొనసాగించేలా ముందుకు సాగాలని కోరారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పార్కులో స్థాపించిన గ్రంథాలయానికి తమ వంతుగా లక్ష రూపాయలను కత్తి పద్మారావు అందజేశారు.

చేబ్రోలు తహశీల్దార్‌పై ప్రజల ప్రశంసలు



ప్రజాశక్తి - చేబ్రోలు

చేబ్రోలు తహశీల్దార్ గోపాలకృష్ణపై ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. తశీల్దార్‌గా గోపాలకృష్ణ బాధ్యతలు చేపట్టిన కొద్ది కాలంలోనే ప్రజలకు సంబంధించిన పలు సమస్యలను ఆయన పరిష్కరించారని గొడవర్రు గ్రామపంచాయతి, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గొడవర్రును సందర్శించి ప్రత్యేకంగా తమ గ్రామ సమస్యలపై న్యాయం జరిగేలా సమస్యలను పరిష్కరిస్తున్నారని, అందుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులకు, మహిళలకు అందాల్సిన అనేక సంక్షేమ పథకాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను అందించే విషయంలో తమకు మేలు జరిగేలా సేవలు అందిస్తున్నారని చెప్పారు. గతంలో మరుగున పడిన, పెండింగ్‌లో స్పందన అర్జీలను ప్రత్యక్షంగా పరిశీలించి పరిష్కరించారని, (గ్రామ ప్రజలతో మమేకమై చేస్తున్న న్యాయపరమైన సహాయాన్ని తాము మరువలేమని అన్నారు.

పేద విద్యార్థిని చదువుకు చేయూత

ప్రజాశక్తి-తెనాలి

రూరల్ గ్రామం కొలకలూరు గ్రామానికి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థిని మూల్పూరు బ్యూల చదువు నిమిత్తం చిలువూరు సౌరీ కుమార్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధ్యక్షులు చిలువూరు నాగరాజు రూ.10 వేలు ఆర్థిక సాయం శనివారం అందజేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ఉన్నం ధర్మారావు నివాసంలో జరిగిన కార్యక్రమంలో ధర్మారావు మాట్లాడుతూ శౌరీ కుమార్ వ్యక్తిగత జీవితంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని దానిని ఆదర్శంగా తీసుకుని ఆయన పేరున కుమారుడు నాగరాజు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ స్థాపించి పేద విద్యార్థిని బ్యూలకు ఆర్థికసాయం చేయడం అబినందనీయమన్నారు.

టిడిపి అధినేతను కలిసిన ప్రసన్న



ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి పట్టణ టిడిపి యువ నాయకులు మునగపాటి ప్రసన్న వెంకటేశ్వరరావు శనివారం టిడిపి రాష్ట్ర కార్యాలయంలో టిడిపి జాతి అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ను కలిసి మంగళగిరి వైభవ పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అధినేత చంద్రబాబు నాయుడు వెంకటేశ్వరావు అభినందించి టిడిపి అభివద్ధికి కషి చేయమని ప్రోత్సహించారు.



హ్యాపీ హాస్పిటల్ లో ఓఆర్ఎస్ డే నిర్వహణ

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక హ్యాపీ హాస్పిటల్లో శనివారం ప్రపంచ ఓ ఆర్ ఎస్ దినోత్సవాన్ని నిర్వహించారు. హ్యాపీ హాస్పిటల్ , ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెనాలి శాఖ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ పావని ప్రియాంక మాట్లాడుతూ వాతావరణ మార్పులు కారణంగా పిల్లలు పెద్దలలో వచ్చే ఆరోగ్య సమస్యలు పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. రెడ్ క్రాస్ కార్యదర్శి భానుమతి, వైద్యశాల సిబ్బంది సాంబయ్య ,నాగరాజు, పూజ, అను, లక్ష్మి, డాక్టర్ ఉష, అశోక్, సత్యనారాయణ, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు చేయూత

ప్రజాశక్తి-మంగళగిరి

పట్నంలో గల ఏడుగురు చిరు వ్యాపారులకు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సహకారంతో శనివారం సాయంత్రం మంగళగిరి గాలిగోపురం సెంటర్లో వివిధ పరికరాలను పంపిణీ చేశారు. చెక్క బండ్లు, వెల్డింగ్ మిషన్లు, వీల్ చైర్స్, ట్రై సైకిల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దామర్ల రాజు, షేక్ రియాజ్, వాకా మాధవరావు, టి జానకి దేవి, గోవాడ దుర్గారావు, గోశాల రాఘవ తదితరులు పాల్గొన్నారు.



జామ మొక్కల పంపిణీ

ప్రజాశక్తి-తెనాలి

సామాజిక సేవా కార్యక్రమాలతోపాటు పర్యావరణ పరిరక్షణలోకూ శారద సర్వీస్ సొసైటీ చేస్తున్న సేవలు గొప్పవని 11వ అదనపు జిల్లా జడ్జి జి. మాలతి అన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో లక్ష జామ మొక్కల పంపిణీ లక్ష్యంగా చేపట్టిన కార్యక్రమాన్ని ముందుగా బుర్రిపాలెం రోడ్డులో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభించారు. దాని కొనసాగింపులో భాగంగా జిల్లా కోర్టు ఆవ రణలో మొక్కల పంపిణీ చేశారు .ముఖ్య అతిథిగా జిల్లా జడ్జి జి మాలతి పాల్గొని సొసైటీ సేవలను అభినందించారు. డాక్టర్ శారద మాట్లాడుతూ జామ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు మెరుగైన ఆరోగ్యం కోసం జామ మొక్కల పంపిణీ చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో చైర్పర్సన్ సయ్యద్ ఖలేదా నసీం, న్యాయమూర్తులు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

21, 22 తేదీల్లో ఎపిఎన్‌జిఒ రాష్ట్ర మహాసభలు

ప్రజాశక్తి-గుంటూరు

విజయవాడ, మున్సిపల్ స్టేడియంలో ఆగస్టు 21, 22 తేదీల్లో జరిగే ఏపీ ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఎపిఎన్‌జిఒ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఘంటసాల శ్రీనివాసరావు, సిహెచ్.సతీష్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్.నాగూర్ షరీఫ్ పిలుపునిచ్చారు. శనివారం మహాసభల పోస్టర్‌ను స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మహాసభల్లో గుంటూరు జిల్లాలోని ఉద్యోగులు భారీగా తరలి రావాలని కోరారు. ఈ మహాసభలకు సిఎం జగన్మోహన్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.జవహర్‌రెడ్డి హాజరు అవుతారని అన్నారు. ఎపిఎన్‌జిఒ బైలాకు సంబంధించి మహాసభల్లో కొన్ని మార్పులు జరుగుతాయని చెప్పారు. మహాసభలకు హాజరవుతున్న సిఎం ఉద్యోగులకు ఏమి వరాలు ప్రకటిస్తారోనని ఉద్యోగులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారని చెప్పారు. పోస్టర్ ఆవిష్కరణలో జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.వెంకటరెడ్డి, యస్.రాజశేఖర్, జిల్లా సంయుక్త కార్యదర్శి కె.సుకుమార్, నగర అధ్యక్షులు ఎస్‌పిఎస్ సూరి, కార్యదర్శి సిహెచ్.కళ్యాణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

'క్విట్ మోడీ - సేవ్ ఇండియా'

ఆగష్టు 9న విజయవాడలో మహాశ్రామిక గర్జన

జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకుల పిలుపు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఆగస్టు 9న విజయవాడలో క్విట్ ఇండియా స్ఫూర్తితో జరిగే మహా శ్రామిక గర్జన సభను జయప్రదం చేయాలని నాయకులు పిలుపిచ్చారు. క్విట్ ఇండియా స్ఫూర్తితో ఆగస్టు 9వ తేదీన క్విట్ మోడీ సేవ్ ఇండియా నినాదంతో విజయవాడలో శ్రామిక మహా గర్జన సభ జరుగుతుందని తెలిపారు. శనివారం ఎఐటియుసి కార్యాలయంలో ఎఐటియుసి, సిఐటియు, పికెఎస్ ఆధ్వర్యంలో వైదన వెంకట్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఎఐటియుసి రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగు రాధాకృష్ణమూర్తి మాట్లాతుడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపైన సమర శంఖం పూరించేందుకు ఈ సభ జరుగుతుందన్నారు. కేంద్రంలో మోడీ అధికారంలో వచ్చినప్పటి నుండి కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకు రావటాన్ని ఖండించారు. అంతేకాకుండా ప్రభుత్వ రంగ సంస్థల మొత్తాన్ని అమ్ముతూ అదాని, అంబానీ లాంటి బహుళ జాతి సంస్థలకు అప్ప చెబుతు న్నారని మండిపడ్డారు. ఎల్ఐని, జిఐని, విమానాలు, ఓడరేవులు, హైవేలు, బొగ్గ గనులు మొత్తాన్ని తెగ నమ్ముతున్నారని భారీ విశాఖ ఉక్కు అమ్మడాన్ని కార్మికులందరూ తీవ్రంగా ఖండించా లన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఆంజనేయులు నాయక్



మాట్లాడుతున్న రాధాకృష్ణమూర్తి

రానున్న కాలంలో కార్మిక సంఘాలు కలిసికట్టుగా క్విట్ మోడీ సేవ్ ఇండియా నినాదంతో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ ఆగస్టు 9న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం కోరుతూ ఆగస్టు 4,5 తేదీలలో పల్నాడు జిల్లాలో అన్ని నియోజక వర్గాల్లో కార్మిక సంఘాలు కలుపుకొని ప్రచారం నిర్వహిస్తామని, 7వతేదీన నియోజకవర్గాలలో ద్విచక్ర వాహన ర్యాలీలు నిర్వహించడం జరుగు తుందన్నారు. ర్యాలీలో కార్మిక సంఘాల అందరు పాల్గొని జయప్రదం చేయాలని, 9వ తేదీన పల్నాడు జిల్లా నుండి విజయవాడకు పెద్ద ఎత్తున కార్మిక వర్గం తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి పల్నాడు జిల్లా కన్వీనర్ కాసా రాంబాబు, నాయకులు బూదాల శ్రీనివాసరావు, దాసరి వరహాలు, సిఐటియు నాయకులు షేక్ సిలార్ మసూద్, పికెఎస్ జిల్లా నాయకులు కొండలు, జిల్లా కౌలు రైతు సంఘం అధ్యక్షులు కామినేని రామారావు, ఏవైఎఫ్ పట్టణ కార్యదర్శి ఆనంద్, ప్రెస్ జేఏసీ నాయకులు మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటలైజేషన్‌లో జిజిహెచ్‌కు రెండోస్థానం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రజల ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చెయ్యడం లో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి ఇండియా లో రెండో స్థానం దక్కిందని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ వెల్లడించారు. ఇండియా డాష్ బోర్డులో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్‌లో రెండో స్థానాన్ని సంపాదించింది. మొదటి స్థానాన్ని ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయగా రాజ్ స్వరూప్ రాణి నెహ్రూ ఆసుపత్రి ప్రథమ స్థానం లో నిలవగా ఏపీ లోని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి రెండో స్థానాన్ని సంపాదించింది. దీని వెనుక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ కృషి ఉంది. గత రెండు మూడు రోజుల నుంచి ప్రత్యేక డ్రైవ్ చేసి ఆయుష్మాన్ హెల్త్ అకౌంట్‌ను క్రియేట్ చేసి వివరాల నమోదుకు శ్రద్ధ కనబర్చారు. డాక్టర్ కిరణ్ కుమార్ ను పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య రికార్డులను ఆధార్ కార్డుతో భాగస్వామ్యం చేయడం వల్ల ఈ ఫలితాలు వచ్చాయన్నారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ కింద ఈ- ఆసుపత్రి గా గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి రూపుదిద్దుకుందని ఆయన చెప్పారు. అయిదారు జిల్లాల నుంచి ప్రభుత్వ ఆసుపత్రి కి 2500 నుంచి మూడు వేల మందికి పైగా రోగులు వస్తున్నారు. గతంలో ఆసుపత్రి లో చికిత్స పొందిన రోగుల కేసు రికార్డు లను పరిశీలన చేయాలంటే కష్టతరంగా ఉండేది. ఈ ఆసుపత్రి గా మారిన తర్వాత పరిస్థితులు మారిపోయాయి. దేశంలో ఏ ప్రభుత్వ ఆసుపత్రి లో నైనా తమ కేసు రికార్డు లను, ల్యాబ్ రిపోర్ట్ లను సులువుగా పొందవచ్చని ఆయన చెప్పారు. ఈ పథకం రోగులకు ఎంతో ఉపయోగకరం గా ఉంటుందని ఆయన అన్నారు.

నేడు మిర్చి యార్డు చైర్మన్ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : గుంటూరు మిర్చి యార్డు చైర్మన్‌గా నిమ్మకాయల రాజ్‌నారాయణ ఆదివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కాకాని గోవర్ధన్ రెడ్డి, విడదల రజనీ, అంబటి రాంబాబు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొంటారు. ఈసందర్భంగా రాజ్‌నారాయణ శనివారం మీడియాతో మాట్లాడుతూ మిర్చి యార్డ్ లోని సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు. రైతులకు, కమిషన్ ఏజెంట్లు, హమాలీల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తానని తెలిపారు. యార్డులో రైతులకు తగిన వసతులు ఏర్పాటు చేస్తామన్నారు. ఆసియాలో అతి పెద్ద యార్డుగా ఉన్న గుంటూరు మిర్చి యార్డుకు ఎంతో మంది ప్రముఖులు చైర్మన్లుగా పనిచేశారని వారి స్ఫూర్తితో అభివృద్ధి పనులు చేపడతానని తెలిపారు. రాజ్‌నారాయణతోపాటు 17 మంది డైరక్టర్లుగా ఇటీవల పాలక మండలిని ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే.

ఎడాపెడా విద్యుత్ ఛార్జీల అదనపు భారం

వీక్షణం

విద్యుత్ వినియోగదారులపై ప్రభుత్వం ఎడాపెడా అదనపు భారం కొనసాగిస్తోంది. ఈ భారం ఎప్పటికి మినహాయింపు ఉంటుందనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. 2014 నుంచి 2019 మధ్య వచ్చిన నష్టాలకు సంబంధించిన సొమ్మును ట్రూ అప్ ఛార్జీల పేరుతో 36 నెలల పాటు వసూలు చేయాలని నిర్ణయించారు. గతేడాది జులై నుంచి ట్రూఅప్ ఛార్జీలను వసూలు చేస్తున్నారు. 12 నెలలుగా అదనపు వసూలు కొనసాగుతోంది. ట్రూఅప్ ఛార్జీల వసూలు పరంపర కొనసాగిస్తూనే తాజాగా 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధిం చిన డిస్కంలకు వచ్చిన నష్టాలకు కూడా ఈ ఏడాది మే నెల బిల్లు నుంచి వసూలు చేస్తున్నారు. యూనిట్‌కు రూ.40 పైసలు అదనంగా వసూలు చేస్తున్నారు. ఇలా ఏడాదిపాటు ఈభారంపడుతుంది. ట్రూఅప్, 2021 మే నెలలో వాడుకున్న విద్యుత్‌కు సర్దుబాటు ఛార్జీ, 2023 ఏప్రిల్ నెల నుంచి సర్దుబాటు ఛార్జీల రూపంలో భారీగా వసూలు చేస్తున్నారు. మొత్తంగా కనీసం రూ.200 నుంచి గరిష్టంగా రూ.400 వరకు అదనపు బిల్లులు వసూలు చేస్తున్నారు. అధికంగా వినియోగించుకునేవారికి, వ్యాపారులకు, పరిశ్రమలకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి వరకు అదనపు భారం పడుతోంది. రానున్న రెండేళ్లపాటు ట్రూ అప్ చార్జీల భారం కొనసాగనుంది. అలాగే పవర్ పర్జేంజింగ్ ఒప్పందాలకు సంబంధించిన ఛార్జీల భారం కూడా మరో ఏడాది పాటు కొనసాగిస్తారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గృహ విద్యుత్ వినియోగదారులపై ప్రభుత్వం విపరీతమైన భారం మోపుతోంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 17.50 లక్షల మందిపై వినియోగదారులు ఉండగా జిల్లా వాసులపై ఏటా రూ.60 కోట్లకుపైగా అదనపు భారం పడుతోంది. సాధారణ వినియోగ ఛార్జీల తో పాటు ట్రూఅప్ ఛార్జీలు ప్రతి యూనిట్‌కు సగటున 1.50 పైసలు భారం పడనుంది. వీటిపై స్థిర ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, బిల్లు చెల్లింపులో ఆలస్యానికి అదనపు రుసుము కూడా పడనుంది. గత నాలుగేళ్లలో ఏడుసార్లు ఛార్జీలను పెంచారని ప్రతిపక్షాలు విమర్శిస్తు న్నాయి. 2014-2019లో డిస్కంలకు వచ్చిన నష్టాలకు సంబంధించి ఇప్పుడు వసూలు చేయడం ఏమిటని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. గతేడాది కాలంగా వివిధ ఛార్జీల పేరుతో వినియోగం కన్నా బిల్లులు అదనంగా వస్తున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. అలాగే ఇప్పటికే సాధారణ ఛార్జీల వసూలుతోపాటు అదనపు లోడ్ వినియోగం పేరిట ప్రతి ఏటా అదనపు డిపాజిట్లు వసూలు చేస్తున్నారు. విద్యుత్ కనెక్షను తీసుకున్నప్పుడు ఉన్న వినియోగంకు, ఆ తరువాత పెరిగిన వినియోగంకు కూడా డిపాజిట్టును వసూలు చేస్తున్నారు. అదనపు వినియోగం వల్ల పెరుగుతున్న భారాన్ని నిరోధించేందుకు ఎక్కువ మంది కొత్త కనెక్షన్లు తీసుకుంటు న్నారు. కుటుంబానికి ఒక్క కనెక్షన్ నిబంధన అమలు చేశారు. ఎక్కువ యూనిట్లు వినియోగించుకుంటే ఛార్జీలు పెరుగుతున్నాయని భావించిన వినియోగ దారులు కొత్త కనెక్షన్లు తీసుకోగా కుటుంబం అంటే తెల్లరేషన్‌కార్డు లేదా ఒక ఫ్యామిలీ ఫోర్షన్ ఉండాలని అంటే తమకు వంట గదులు ప్రమాణికం అని ఇటీవల అధికారులు ప్రత్యేక తనిఖీలు చేసి కొన్ని మీటర్లను రద్దుచేశారు. దీంతో కొంత మంది యూనిట్ రేటు రూ.8వరకు పడుతోంది.వీటిపై అదనపు ఛార్జీలు యథాతథంగా వసూలు చేస్తున్నారు. విద్యుత్ ఛార్జీలపెంపునకు నిరసనగా వామ పక్షాలు ఆందోళనలు,నిరసనలు కొనసాగిస్తూనే ఉన్నాయి.

(ఎ.వి.డి.శర్మ)



పలకలూరురోడ్డులో టిడిపి వినూత్న నిరసన

రోడ్డుమీద గుంతల్లో పడవలు, బాతులతో నిరసన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో గత 4 ఏళ్లుగా రహదారులను మరమ్మతులు చేయకుండా వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరి స్తుందని తెలుగుయువత జిల్లా అధ్యక్షులు రావిపాటిసాయి ఆరోపించారు. పలకలూరు రోడ్డులో గతేడాది జులై 29న పరిస్థితి ఎలా ఉందో ఏడాది తరువాత కూడా రోడ్డు అలాగే అధ్వానంగా ఉండటాన్ని ఖండిస్తూ వర్షాలకు గుంతలలో నిలిచిన నీటిలో బాతులు వదిలి నిరసన తెలిపారు. 'మా ఊరు గుంటూరు చేసారు గుంతలూరు' అంటూ రాష్ట్రంలో అధ్వానంగా మారి మృత్యు కూపాలుగా గుంతలమయంగా మారిన రోడ్లను వెంటనే బాగు చెయ్యాలని డిమాండ్ చేశారు. పెద్ద పలకలూరు రోడ్డులో రత్నగిరి నగర్ వద్ద రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి అంటూ బాతులు , పేపర్ పడవలు వదుల్తూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. రాష్ట్రంలో అద్వానంగా మారి మత్యుకూపాలుగా గుంతలమయంగా మారిన రోడ్లను వెంటనే బాగు చేసి ప్రజలు ప్రమాదాల భారీ నుండి కాపాడాలన్నారు. లేకుంటే తెలుగు యువత పౌర సమాజంతో కలిసి ఉద్యమం బాట పట్టి ప్రభుత్వాన్ని ఎండగడతామన్నారు. తెలు గురైతు రాష్ట్ర ప్రచారరకార్యదర్శి గింజుపల్లి వెంకటేశ్వరావు, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు షేక్ ఫిరోజ్ తెలుగు రైతు రాష్ట్ర ప్రచార కార్యదర్శి గింజుపల్లి వెంకటేశ్వరావు, గుంటూరు జిల్లా టిడిపి అధికార ప్రతినిధి కల్లూరి శ్రీనివాసరావు, గుంటూరు అర్బన్ టిడిపి ప్రధాన కార్యదర్శి ముత్తినేని రాజేష్, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు షేక్ ఫిరోజ్, ఐటీడీపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పంచుమర్తి శేషు, రాష్ట్ర అధికార ప్రతినిధి బెతమల మణిరత్నం, 40 డివిజన్ టిడిపి అధ్యక్షులు సయ్యద్ అహమ్మద్, నగర టిడిపి కార్యదర్శి టీడీపీ కార్పొరేటర్ అభ్యర్థి పొన్నగంటి శ్రీనివాస రావు, తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాతిరెడ్డి లక్ష్మరెడ్డి, బిసి సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుమ్మేటి మురళి, తోటా ఆంజనేయులు, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షులు గుత్తికొండ కిరణ్ యాదవ్, అధికార ప్రతినిధి సింగంశెట్టి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.